
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025





శ్రీకాకుళం : మార్కెట్‌లోని రామాలయంలో స్వామిని దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం : కోదండ రామాలయంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



- జిల్లాలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

వైభవం.. సీతారాముల కల్యాణం



కోదండ రామాలయం వద్ద బారులుదీరిన భక్తులు



శ్రీకాకుళం కల్చరల్ ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):

శ్రీరామనవమి పర్వదినం వేళ.. జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆదివారం జిల్లావ్యాప్తంగా రామ మందిరాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎక్కడ చూసినా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. సీతారాముడి కల్యాణం కమనీయంగా సాగింది. శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో ఉన్న అతి పురాతనమైన కోదండరామాలయంలో ఘనంగా సీతారాముడి కల్యాణ వేడుకలు నిర్వహించారు. బంకుపల్లి శేషాచార్యులు, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బారులుదీరారు. అలాగే పొట్టిశ్రీరాముల మార్కెట్‌లోని కోదండరామాలయంలో స్వామిని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు దర్శించుకున్నారు. బొందిలీపురంలోని తుల్జాభవానీ ఆలయంలో ధర్మకర్త రాంగోపాల్ సింగ్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, శ్రీరామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. బలగ, కాలభైరవ పీఠం, రెల్లవీధి, తదితర ప్రాంతాల్లోని శ్రీరామాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఈవో సర్వేశ్వరరావు, ఉపనిషత్ మందిరం సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలపై విముఖత!

- తరచూ వెలుగుచూస్తున్న లోపాలు
- తగ్గుతున్న విద్యార్థినుల సంఖ్య
- తాజాగా 6వ తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లకు నోటిఫికేషన్
- 2000 సీట్ల భర్తీకి సన్నాహాలు
- ఈ నెల 11 వరకూ దరఖాస్తుల స్వీకరణ



ఇచ్ఛాపురం కేజీబీవీ పాఠశాల

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):

కస్తూర్బా బాలికా విద్యాలయాలు అనుకున్న లక్ష్యాలను సాధించలేక పోతున్నాయి. ప్రారంభంలో మెరుగైన విద్యాబోధన, వసతి అందించడంతో ఈ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి చూపేవారు. కానీ క్రమేపీ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల్లో ఆసక్తి తగ్గుతోంది. తాజాగా జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఆరో తరగతితోపాటు ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 7,8,9,10 తరగతులకు సంబంధించి మిగులు సీట్లకు కూడా ఈ నెల 11 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అయితే కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కావడం లేదు. పాఠశాలల్లో వెలుగుచూస్తున్న లోపాలు కారణంగా కేజీబీవీలపై విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. జిల్లావ్యాప్తంగా 25 కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. తొలుత 6 నుంచి పదో తరగతి వరకూ ఉన్న ఈ పాఠశాలను కొన్నేళ్ల కిందట ఇంటర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. సంప్రదాయం కోర్సులతో పాటు ప్రత్యేక సాంకేతిక కోర్సులను సైతం అందుబాటులోకి తెచ్చారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, కంప్యూటర్, టాలీ వంటి వృత్తివిద్యా కోర్సులను ఏర్పాటు చేశారు. మంచి కోర్సులు ఉన్నా.. ఎక్కడా అధ్యాపకులను నియమించిన దాఖలాలు లేవు. పదో తరగతి వరకూ బోధించే సీఆర్టీలే ఇక్కడ అధ్యాపకులుగా బోధన సాగిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా మహిళా ఉపాధ్యాయులు (సీఆర్టీలు)ను నియమించారు. నిరంతర వైద్య సేవల కోసం ఒక ఏఎన్ఎం సైతం అందుబాటులో ఉంటుంది. బోధనేతర సిబ్బంది, చివరకు స్వీపర్లు, వాచ్‌మెన్ సైతం మహిళలే ఉంటారు. బాలికా రక్షణకు పెద్దపీట వేస్తూ ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలను సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. చాలా మంది తల్లిదండ్రుల్లో అవగాహన లేక వీటిలో చేర్పడం లేదు. అలాగే ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడం, చాలా పాఠశాలల నిర్వహణలో సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో మరికొందరు విముఖత చూపుతున్నారు. ఈ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికిగాను 25 పాఠశాలల్లో 40 సీట్లు చొప్పున మొత్తం వెయ్యి సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఇక ఇంటర్ కోర్సుకు సంబంధించి 40 సీట్లు లెక్కన మరో 1000 అడ్మిషన్లు చేయాల్సి ఉంది. కాగా ఇప్పటివరకూ 300 లోపే దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. గడువులోగా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయో లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్వహణ లోపాలు..

కేజీబీవీల నిర్వహణలో తరచూ వైఫల్యాలు బయటపడుతున్నాయి. చాలా పాఠశాలలకు ప్రహరీలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో కేజీబీవీలు ఏర్పాటు చేయడం కూడా ఇబ్బందికరంగా మారింది. పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు అన్నిరకాల వసతులు అందుబాటులోకి తెచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం చాలాచోట్ల ఇబ్బందులు ఉన్నాయి. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. వంటల నిర్వహణలో నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారుతోంది. అందుకే తరచూ విద్యార్థినులు అనారోగ్యానికి గురికావాల్సి వస్తోంది.

- గత ఏడాది జూలై 6న కోటబొమ్మాళి కేజీబీవీ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినులు అస్వస్థ తకు గురయ్యారు. కలుషిత ఆహారం తిని విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. దీంతో వెంటనే పాఠశాల సిబ్బంది టెక్కలి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం అందించడంతో ప్రమాదం తప్పింది.
- మార్చి 28న మందస కేజీబీవీలో 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మందస మండలంలోని గుడామణి రాజపురంలో కేజీబీవీని నిర్వహిస్తున్నారు. అయితే ఆ రోజు రాత్రిపూట ఆహారం తిన్న తరువాత విద్యార్థినులు వాంతులు, విరోచనాలు, కళ్లు తిరగడంతో వెనువెంటనే సిబ్బంది హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. వైద్యం అందించడంతో కోలుకున్నారు.

అవినీతి ఆరోపణలు

సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో ఉండే ఈ పాఠశాలల్లో నిధుల ఖర్చు విషయంలో అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకాధికారుల ఖాతాల్లో నిధులు కొందరు దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతుండగా.. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. వాస్తవానికి పాఠ శాలల్లో సీఆర్‌టీలు తప్పనిసరిగా ఉండాలి. రాత్రికి రోజుకొకరు చొప్పున రాత్రి విధులు నిర్వహించాలి. తప్పకుండా ప్రత్యేకాధి కారి పాఠశాలలోనే ఉండాలి. కానీ చాలా పాఠశాలల ప్రత్యేకాధికారులు, సీఆర్‌టీలు సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. చాలా పాఠశాలలకు ఇప్పటికీ ప్రత్యేకాధికారులు లేరు. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. సీఆర్‌టీలు కూడా పూర్తి స్థాయిలో లేరు. ఇంటర్‌కు సంబంధించి అధ్యాపకులు కూడా తగినంతమంది లేరు.

పెద్ద మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- వ్యాపారులు, ప్రజలకు ఆమోదయోగ్యంగా నిర్మిస్తాం
- 15 నుంచి వేరొకచోట వ్యాపారాలకు ఏర్పాట్లు
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

అరసవల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర, రాష్ట్ర మంత్రులు మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి వారిద్దరూ పెద్దమార్కెట్‌ను పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. 'ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ మార్కెట్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరాదరణకు గురై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీనిని మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం. నగర అభివృద్ధిలో భాగంగా ఆమోదయోగ్యంగా నిర్మిస్తాం. అందరికీ వ్యాపారాలు జరిగేలా, ప్రజలు స్వేచ్ఛగా మార్కెట్‌కు వచ్చి సరుకులు కొనుక్కునేలా సర్వాంగసుందరంగా మార్చుచేస్తాం. సమగ్ర ప్రణాళికతో 'యు' ఆకారంలో నిర్మిస్తాం. ఇప్పుడు వ్యాపారాలు చేసుకుంటున్న వారందరికీ షాపులను కేటాయిస్తాం. ఎవరూ నష్టపోకుండా చూసే బాధ్యత తీసుకుంటాం. వ్యాపారులతో సమావేశమై వారి అభిప్రాయాలకు అనుగుణంగానే ముందుకు వెళతాం. ఈ నెల 15 నుంచి మార్కెట్‌ను ఖాళీ చేయాలి. పునర్నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభిస్తాం. నిర్మాణాలు పూర్తయినంతవరకు వ్యాపారాలు వేరేచోట జరిగేలా చర్యలు తీసుకుంటాం. విశాలమైన పార్కింగ్, ఆధునిక గోదాములు, మార్కెట్‌కు అవసరమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నగరాన్ని (మిగతా 7వ పేజీలో..)



వ్యాపారులతో మాట్లాడుతున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

కొండపైకి నీరిచ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- అడ్డివాడలో ట్యాంకర్లతో సరఫరా

మెళియాపుట్టి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలంలో కొండపై ఉన్న గ్రామాలకు ఎట్టకేలకు సంబంధిత అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా చర్యలు చేపట్టారు. కొండపై గ్రామాల్లో రక్షితనీటి పథకాలు మరమ్మతులకు గురయ్యాయి. పైపులైన్లు పాడైపోయాయి. ఈక్రమంలో గిరిజనులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గతనెల 11న 'ఆంధ్రజ్యోతి'లో 'కొండ గ్రామాలకు నీరేదీ' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం అడ్డివాడ గ్రామానికి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినట్టు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. కొండపైకి రిగ్గు బోరును వేయడం ద్వారా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఉన్న ఊటబావి నీరు సైతం పూర్తిగా రాకపోవటం వల్ల తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో చెరువుతో పాటు బోరు, బావి సైతం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎట్టకేలకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.



అడ్డివాడలో సరఫరా చేస్తున్న నీరు

ఇక స్మార్ట్ కార్డులు

- దివ్యాంగులకు, రేషన్‌కార్డు లబ్ధిదారులకు త్వరలో పంపిణీ
- ఎక్కడి నుంచైనా లబ్ధి పొందే అవకాశం

హరిపురం/ నరసన్నపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు, రేషన్‌కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం దివ్యాంగులకు సదరం శిబిరంలో వైకల్యం శాతాన్ని తెలిపే ధ్రువపత్రాన్ని కాగితం రూపంలో అందజేస్తున్నారు. ఇది వర్షానికి తడిసినా, చిరిగినా ఇబ్బందే. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచించి యూడీ (యూనిక్ డీసెబిలిటీ) ఐడీ సంఖ్యతో పీవీసీ రూపంలో స్మార్ట్ కార్డులు జారీ చేయనుంది. అందుకుగాను ప్రత్యేక పోర్టల్ ప్రారంభించింది. ఈ నెల 1 నుంచి దివ్యాంగులు నేరుగా దరఖాస్తు చేసుకొనే అవకాశాన్ని కల్పించింది. జిల్లాలో సుమారు 56వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 31,498 మందికి వికలాంగ పింఛన్లు అందుతున్నాయి. ఎముకలకు సంబంధించిన వ్యాధిగ్రస్థులు 18543 మంది, కంటికి సంబంధించిన వారు 4901 మంది, వినికిడి లోపం ఉన్నవారు 3831 మంది, మానసిక సమస్యలతో ఉన్నవారు 3821 మంది, మూర్ఛవ్యాధిగ్రస్థులు 245 మందితోపాటు మరో 157మంది వివిధ రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరితోపాటు మరో 22వేలమందికి సదరం ధ్రువపత్రాలు లేవు. దీంతో వీరంతా సదరంతోపాటు యూడీఐడీ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

పొందడం ఇలా...

- సదరం ధ్రువపత్రం ఉన్నవారు నేరుగా యూడీ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని (మిగతా 8వ పేజీలో..)



రేషన్ సరుకుల పంపిణీ (ఫైల్)

బైక్ అదుపు తప్పి..

- కింతలిమిల్లు జంక్షన్‌లో రోడ్డు ప్రమాదం
- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



హరిప్రసాద్ (ఫైల్)

8లో

70 ఎకరాల జీడితోట దగ్ధం

8లో

అక్షర నామాలతో..



ఆంగ్ల అక్షరాలతో తయారు చేసిన రామనామాలు

సోంపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా బారువలో గల జనార్దనస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. పట్టణానికి చెందిన చిన్నారులు వినయ, వందన 'ఏ' నుంచి 'జడ్' వరకు గల ఆంగ్ల అక్షరాలతో గల రామ నామాలు ఆకట్టుకున్నాయి. ఏ- అయోధ్య రామ, బీ- భార్గవ రామ, సీ- చిన్మయరామ, డీ- దశరథ రామ, ఎఫ్- ఫల్గుణరామ, జీ- గుణాత్మక రామ, హెచ్- హనుమంత రామ, ఐ- ఇనయన రామ, జే- జగదభి రామ, కే- కౌసల్య రామ, ఎం- మర్యాదరామ, ఎన్- నరహరి రామ, ఓ- ఓంకార రామ, పీ- పురుసక్షత్తమరామ, క్యూ- కుశలవరామ, ఆర్- రఘుకుల రామ, ఎస్- సీతారామ, టీ- తారకరామ, యు- ఉదాత్తరామ, వీ- వశిష్ట రామ, డబ్ల్యూ- వైకుంఠరామ, ఎక్స్- జితేంద్ర రామ, వై- యోగితరామ, జడ్- జనహిత రామ అంటూ రాసిన నామాలు ఆకట్టుకున్నాయి.

శ్రీరాముని తాకిన సూర్యకిరణాలు



స్వామివారి విగ్రహంపై పడిన సూర్యకిరణాలు

శ్రీకాకుళం కల్చరల్ ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నక్కవీధిలో ఉన్న ఉమా జఠళేశ్వ రాలయంలో అర్చకులు బి.కుమార్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ క్రమంలో శ్రీరాముడి విగ్రహాన్ని ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. ఈ అద్భుత దృశ్యాలను తిలకించిన భక్తులు ఆనందపరవశులయ్యారు.

రాముడి చరిత్ర ఆదర్శనీయం

అరసవల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరాముడి చరిత్ర అందరికీ ఆదర్శనీయమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అరసవల్లి శ్రీశయన వీధిలో గల రామాలయంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో కేంద్ర మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొని మాట్లాడారు. హిందూ సంప్రదాయంలో శ్రీరాముడికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, నగర బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి వెంకటరమణ, రాయి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు క్వార్టర్స్‌లోని కోదండ రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఏఎస్పీ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఎం పురంలోని రామాలయంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది.

మకరతోరణం సమర్పణ

బూర్జ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) మదనాపురం గ్రామంలో గల రామాలయానికి రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, శ్రీదేవి దంపతులు స్వామివారికి ఇత్తడితో తయారు చేసిన మకరతోరణాన్ని సమర్పించారు. దీనితో రామాలయం నూతన శోభ సంతరించుకుంది.

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం



తలంబ్రాల వేడుక

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ





కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు



టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

మద్యం దుకాణం వద్ద తగాదా

● సేల్స్‌మన్‌కు గాయాలు

మెళియాపుట్టి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్యం దుకాణం వద్ద ఆదివారం రాత్రి జరిగిన తగాదాలో ఒక వ్యక్తికి గాయాలైనట్లు ఎస్ఐ పిన్నిం టి రమేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చాపర గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు వచ్చి బీరు బోటిళ్లను కొనుగోలు చేశారు. కొంతసేపటి తరువాత సీల్ తీసిన బీర్ సీసాలు తిరిగి తీసుకుని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీల్ తీసిన బాటిళ్లను తిరిగి తీసుకోవడం జరగదని సేల్స్‌మన్ ఢిల్లీశ్వరరావు తెలిపాడు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తులు ఢిల్లీశ్వర రావుపై దాడి చేశారు. వెంటనే అతడిని టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న భక్తురాలు

అరసవల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన వలివేటి శ్రీదేవి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం వారి అన్నయ్య జయ రామారావు జ్ఞాపకార్థం స్వామి వారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,00,001 ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళంగా అందజేశారు. స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.2,89,001 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,12,600, విరాళాలుగా రూ.60,521, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,15,880 లభించాయి. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా అలాగే స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకులు స్వాగతం పలుకగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో భద్రాజీ వారికి అందజేశారు.

గ్రామీణ రహదారులకు మోక్షం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

సోంపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మామిడిపల్లి పంచాయతీ చిన్నమామిడిపల్లిలో బీటీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం అదేగ్రామంలో జరిగిన ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తెలుగుజాతి రుణం తీర్చుకోండి



ఎన్‌ఆర్‌ఐలతో ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస/పొందూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు తెలుగు జాతి రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే రవికుమార్ డల్లాస్‌లో ఉన్న ఎన్‌ఆర్‌ఐలు ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ విశిష్టత అనే సమావేశంలో పాల్గొని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవికుమార్ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో స్థిరపడిన తెలుగువారు తమ స్థాయికి తగ్గట్టు పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి తెలుగుజాతి రుణం తీర్చుకోవాలని కోరారు.

వేడుకగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

రణస్థలం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బీజేపీ జెండాను ఎన్‌ఈఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పార్లమెంట్ స్థానాలతో ప్రారంభమైన బీజేపీ నేడు దేశంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలు, అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు నెలకొల్పిన ఘనత నరేంద్ర మోదీదని కొనియాడారు. బీజేపీ అభ్యర్థిగా ఎచ్చెర్ల నుంచి గెలుపొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, ఎం.అనంత, లంక అప్పలనాయుడు, వెలిచేటి చిన్నమౌళి తదితరులు పాల్గొన్నారు.



మంత్రులొస్తున్నారు.. శుభ్రం చేద్దాం



ఒకవైపు కలెక్టర్ ఉండగానే మార్కెట్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం



అరసవల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గల పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌ను ఆదివారం ఉదయం కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు పరిశీలించారు. మంత్రులు వస్తున్నారనో.. ఏమో.. పురపాలక సిబ్బంది అప్పటికప్పుడే మార్కెట్‌ను శుభ్రం చేయడం మొదలెట్టారు. అప్పటికే కలెక్టర్ మార్కెట్‌కు చేరుకున్నారు. ఒకవైపు కలెక్టర్ అధికారులతో మాట్లాడుతుంటే.. సిబ్బంది క్లీనింగ్ పనులు చేపట్టారు. మంత్రులు వస్తున్నారని ముందే తెలిసినా సరే, వారు వచ్చే సమయానికి కూడా మార్కెట్‌ను పూర్తిగా పరిశుభ్రం చేయకపోవడం గమనార్హం. మంత్రులు వచ్చాక కూడా పెద్ద మార్కెట్ నుంచి చేపల బజార్‌కు వెళ్లే మార్గంలో చెత్తను తొలగిస్తూ సిబ్బంది కనిపించారు. నిత్యం చెత్త, చెదారంతో అపరిశుభ్రంగా కనిపించే పెద్ద మార్కెట్.. సాక్షాత్తు మంత్రులు వచ్చినప్పుడే ఇలా నిర్లక్ష్యంగా ఉంటే, సాధారణ రోజుల్లో పరిస్థితేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం ఎదురుగానే మార్కెట్ ఉన్నా.. పరిశుభ్రతపై ఎంతశ్రద్ధ ఉందో ఈ ఘటనే అర్థం చేసుకోవచ్చనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు చొరవ తీసుకుని పెద్ద మార్కెట్ పరిశుభ్రతపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పెద్ద మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

(ఐదో పేజీ తరువాయి)

ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రజలందరూ సహకరించాలి. పీ-4 వేదికగా నగరంలో నదీతీరంలో పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, కొత్త బస్టాండ్, నూతన నగర కార్పొరేషన్ కార్యాలయం వంటి పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నాం. వాటిని నిర్మించి సమస్యలకు తావు లేకుండా నగరాన్ని అభివృద్ధి చేస్తాం. రథసప్తమి ఉత్సవాల సందర్భంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. వాటిని మరింత ముందుకు తీసుకువెళతాం. నగరపాలక సంస్థ ఇంజనీర్లు, అధికారులు మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్లాన్‌ను తయారు చేయండి. అలాగే బడ్జెట్ కూడా తయారు చేసి మాకు అందజేస్తే తక్షణ చర్యలు ప్రారంభిస్తాం. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. జిల్లాకు సరికొత్త రూపునివ్వడమే లక్ష్యమ'ని కేంద్ర, రాష్ట్ర మంత్రులు తెలిపారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు మెండ దాసునాయుడు, కోరాడ హరగోపాల్, నవీన్, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, ఇంజనీర్ పొగిరి సుగుణాకరరావు, నవీన్, దుంగ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న గ్రామస్థులు

కవిటి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రగడపుట్టుగలో కోదండ రామాలయ వార్షికోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన కళాకారులచే గాత్రకచేరిని నిర్వహించారు. అనంతరం కళాకారులు వెంకటేశం, లక్ష్మణరావు, దేవరాజు, రామారావు, అనంతాచార్యులును గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బలరామ్మూర్తి, కృష్ణారావు, రామప్రసాద్, శ్రీనివాస్, బాబ్జీ, శంకరరావు పాల్గొన్నారు.

సుందర నగరమే లక్ష్యం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



సమస్యలపై కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరాని సమస్యలు లేకుండా సుందర నగరంగా తీర్చిదిద్దడేమ లక్ష్యమంతి ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం నగర పరిధిలోని సత్యసాయి నగర్, షిర్డీసాయి నగర్, వరం కాలనీల్లో నగర కమిషనర్ ప్రసాదరావుతో కలిసి ఆయన పర్యటించారు. వీధివీధి కలియతిరిగి సమస్యలు తెలుసుకున్నారు. వీధుల్లో మురుగునీరు కాలువలు కావాలని కాలనీ వాసులు కోరగా, మిర్తిబట్టి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో హెల్త్ అధికారి, ఇంజనీరింగ్ సిబ్బంది, చాపురం, ఆదివారంపేట సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు రాజారావు, పీఎంజే బాబు, కాలనీ వాసులు ధర్మారావు, జగన్నాథరావు, కృష్ణమూర్తి, అల్లు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

భజగోవింద సంబరాలకు శుభరాట

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలో వచ్చే నెల 8 నుంచి ప్రారంభం కానున్న భజగోవింద సంబరాల మహోత్సవాలకు ఆదివారం శుభరాట శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. మే 8 నుంచి వారం రోజులపాటు సంబరాలు నిర్వహిస్తున్న ట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శుభరాట కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు



విద్యా విధానంపై అవగాహన పెంచుకోవాలి

కవిటి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన విద్యా విధానంపై అవగాహన పెంచుకోవాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో ఆదివారం సోంపేట, కంచిలి మండలాల పాఠశాల యాజమాన్య కమిటీ, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. గత వైసీపీ హయాంలో తీసుకువచ్చిన జీవో నెం.117తో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారిందని, దానిని సరిచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న మోడల్ పాఠశాలల వల్ల ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు వస్తాడన్నారు. పాఠశాల యాజమాన్యకమిటీల ఆమోదం లేకుండా పాఠశాలలు ఎత్తివేయడం జరగదన్నారు. కంచిలి, సోంపేట ఎంఈవోలు శివరాంప్రసాద్, జోరాడు పాల్గొన్నారు.

అంతా రామమయం

● భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం ● విశేష పూజలు, అన్నప్రసాద వితరణలు ● భక్తులతో ఆలయాలు, మందిరాల కిటకిట

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయాలకు వచ్చి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, తిరువీధి ఉత్సవాలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: జట్టు కలానీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


కాశీబుగ్గ: చిన్నబ్రాహ్మణవీధి శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష


పాతపట్నం: తామర గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దంపతులు


రణస్థలం: కోష్టలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు


పలాస: సీతారామాలయంలో మహా అన్నదానం


కోటబొమ్మాళి: ఊడికలపాడులో..


టెక్కలిలో పాల్గొన్న భక్తులు


రణస్థలం: తిరుపతిపాలెంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ దంపతులు


ఇచ్ఛాపురం: ఈదుపురంలో రామ మందిరం ప్రారంభోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే బెందాళం అశోక్


అరసల్లి: కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఆలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


హిరమండలం: హిల్ కాలనీ రామాలయంలో..


జలుమూరు: హరికృష్ణమ్మపేటలో స్వామివారి గ్రామోత్సవంలో కలశాలతో పాల్గొన్న భక్తులు


శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురం తుల్జాభవానీ ఆలయంలో..


హరిపురం: సాబకోటలో స్వామి వారి తిరువీధి

బైక్ అదుపు తప్పి..

● కింతలిమిల్లు జంక్షన్‌లో రోడ్డు ప్రమాదం

● ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో బస్సు కింద హరిప్రసాద్ మృతదేహం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కింతలిమిల్లు జంక్షన్‌లో ఆదివారం బైక్ అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయ పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని జరజాం గ్రామానికి చెందిన బస హరిప్రసాద్ (21), ఎచ్చెర్ల గ్రామానికి చెందిన జలుమూరు వేణు స్నేహితులు. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యా హ్నం వీరి ద్దరూ కలిసి వేరొక స్నేహితుడి స్పోర్ట్స్ బైక్‌పై శ్రీకాకుళం నగరానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. జాతీయ రహదారిపై కింతలి మిల్లు జంక్షన్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఆ సమయంలో హరిప్రసాద్ బైక్‌ను నడుపు తుండగా, వెనుక వేణు కూర్చొన్నాడు. కింతలి మిల్లు జంక్షన్‌కు వచ్చే సరికి ముందు వెళ్తున్న వ్యాన్, లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్ అదుపు తప్పింది. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వేణు కాళ్లపై నుంచి వెళ్లగా.. హరిప్రసాద్‌ను లారీ బలంగా ఢీకొట్టడంతో తుళ్లి పోయి అదే రూట్‌లో వస్తున్న ఆర్టీసీ బస్సు కిందపడ్డాడు. అప్రమత్తమైన డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి బస్సును నిలిపివేశాడు. ఈ ప్రమాదంలో హరిప్రసాద్ అక్కడి కక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయ పడిన వేణును 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. హరిప్రసాద్ తల్లి రమణమ్మ శ్రీకాకుళంలోని ఓ బట్టల దుకాణంలో పని చేస్తూ ఇద్దరు కుమారులతో కలిసి జీవనం సాగిస్తుంది. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఆమదాలవలస, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస రైల్వే స్టేషన్ సమీపంలో ఊసవానిపేట రైల్వేగేటు వద్ద ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు అస్సాం రాష్ట్రానికి చెందిన బలిన్ దుర (35)గా రైల్వే పోలీసులు గుర్తించినట్టు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించామన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి: బగ్గు

జలుమూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. దరివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠలో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ నారాయణరావు, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు వేగవంతం చేయాలి

జలుమూరు (సారవకోట) ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బైదలాపురం వద్ద రూ.1.33 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బైదలాపురం వద్ద చేపడుతున్న పనులను ఆదివారం పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, బైరి భాస్కరరావు పాల్గొన్నారు.

ముగిసిన నీలమణి దేవి వసంతోత్సవాలు

జలుమూరు (సారవకోట) ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అవలింగి గ్రామంలో పాతపట్నం నీలమణి దేవి త్రిరాత్రి వసంత మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి శోభాయాత్ర చేపట్టారు.

పోస్టల్ బీమాతో ప్రయోజనం

కవిటి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బీమా పథకాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రాజశేఖర్ కోరారు. అసోసియేషన్ సభ్యులకు ఆదివారం బీమా కార్డులను అందించారు. పోస్టు ఆఫీసులో రూ.755తో ఉమ్మడి బీమా చేయించుకోవాలని కోరారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని 51 మంది ఫొటోగ్రాఫర్లకు కార్డులను అందించినట్టు తెలిపారు.

అమాత్యా కరుణించండి..

● కేంద్రమంత్రిపై ప్రజల ఆశలు

● నేడు నియోజకవర్గంలో రామ్మోహన్ నాయుడు పర్యటన

నరసన్నపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గంలో అపారమైన వనరులున్నా అవసరమైన పరిశ్రమలు కాని, కేంద్ర సంస్థలు కాని లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 54 కిలోమీటర్ల మేర వంశ ధార నది, 22 కిలోమీటర్ల సముద్రతీరం, జాతీయ రహదారి, ఎతైన కొండలు, వాణిజ్యం, విద్యాపరంగా నరసన్నపేట పట్టణం అనుకూలంగా ఉంది. అయితే ఒక్క పరిశ్రమ కూడా లేదు. అలాగే కేంద్ర విద్యాసంస్థ లేదు. నియోజవర్గంలో సుమారు 60వేలు ఎకరాల్లో వరి సాగు అయి, జిల్లాలో అత్యధికంగా వరిపంట పండించే ప్రాంతంగా గుర్తింపు ఉన్నా ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు లేవు. దీంతో ఆయా విభాగాల్లో పనుల కోసం ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పోలాకి మండలంలో మత్స్యకారులు వేట చేసిన చేపలను నిలువ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీలు లేవు. అనేక అవకాశాలున్న నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలో సోమవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పర్యటించనున్నారు. ఇప్పటికైనా కేంద్ర మంత్రి చొరవ తీసుకుని యువతకు ఉపాధి కల్పించేందుకు భారీ పరిశ్రమ, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తిలారు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తే పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

పర్యటన వివరాలిలా..

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నియోజవర్గంలో సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు డోల-వనిత మండలం రోడ్డుకు, ఉదయం 11 గంటలకు పోలాకి మండలం చెల్లాయివలస-చీడివలస రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు నరసన్నపేట ప్రజాసదన్‌లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3 గంటలకు నరసన్నపేట మండలం ఉర్లాం పంచాయతీ బొడ్డవానిపేట వద్ద తండ్యాలపేట బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 4.30 గంటలకు ముషిడిగట్టు-లుకలాం రోడ్డు పనులను ప్రారంభించనున్నారు.

సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ


మాట్లాడుతున్న కుమార్‌నాయక్

పలాస, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సజీవమని, సమాజాన్ని నిర్దేశించే సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాహితీవేత్త, రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు కుమార్ నాయక్ అన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా స్థానిక లయన్స్‌క్లబ్ సమావేశ మందిరంలో జనజాగృతి సాహితి సాంస్కృతిక స మాఖ్య ఆధ్వర్యంలో ఉత్కలాంధ్ర కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పలువురు కవులు స్వీయ కవితా పఠనాన్ని నిర్వహించారు. సాహితీవేత్తలు తెప్పల కృష్ణమూర్తి, ఉత్తరపల్లి నాగేశ్వరరావు, వెంకట రంగనాథం, వంకల రాజారావు, పందిరి మధూసూదనరావు, కోదండ రామయ్య, బాలక లోకనాథం, దండా సి, బమ్మిడి సుబ్బారావు పాల్గొన్నారు.

70 ఎకరాల జీడితోట దగ్ధం


ఎగిసిపడుతున్న మంటలు

పొందూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం సమీపంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 70 ఎకరాల జీడితోట దగ్ధమైంది. విశాఖకు చెందిన ఓరుగంటి నరేష్‌కుమార్‌కు చెందిన 70 ఎకరాల జీడితోట ఉంది. ఆదివారం ఉదయం తోట నుంచి ఒక్కసారిగా మంటలు చెల రేగి మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న పొందూరు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఎ.రామకృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొనగా.. అప్పటికే మంటలు భారీగా చెల రేగాయి. అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షలు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదని తెలిపారు.

ఇంటికి 'పన్ను' పోటు

● నిబంధన సవరించాలంటున్న లబ్ధిదారులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై 2.0) పథకంలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు గతంలో ఇల్లు ఉండి పన్ను చెల్లిస్తున్నట్లయితే వారిని జాబితా నుంచి తొలగిస్తారన్న ప్రచారం నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ నిబంధన అమలైతే ఎక్కువ మంది అనర్హులయ్యే ప్రమాదం ఉందనేది వారి ఆవేదన. హౌసింగ్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ లబ్ధిదారులు, వారు చెల్లిస్తున్న ఇంటి పన్ను వివరాలు సచివాలయ కార్యదర్శుల నుంచి సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల జాబితాల్లో తమ పేర్లు ఎక్కడ తొలగిస్తారోనని పలువురు లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో 1,573 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినా వారిలో అధిక సంఖ్యలో ఇంటి పన్ను చెల్లించేవారు ఉన్నారు. ఈ నిబంధన అమలు చేస్తే జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది అనర్హులుగా మారే అవకాశం ఉందనేది వారి వాదన. గతంలో రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. ఒకసారి ప్రభుత్వం నుంచి సబ్సిడీపై ఇంటి నిర్మాణం పొంది ఉంటే అలాంటి వారిని మరలా లబ్ధిదారులుగా ఎంపిక చేసేవారు కాదు. కాని ప్రస్తుతం ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇల్లు పొందనప్పటికీ తరాల నుంచి వస్తున్న ఇంటికి చెల్లిస్తున్న పన్ను కారణంగా అనర్హులుగా మారే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ నిబంధనను సవరించి అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై మండల హౌసింగ్ ఏఈ సాయికిరణ్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారుల జాబితాతో పాటు వారి ఇంటి పన్ను వివరాలను పంచాయతీల కార్యదర్శుల నుంచి తీసుకుంటున్నామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని, తదుపరి వారి ఆదేశాల మేరకు తుది జాబితాను తయారు చేస్తామన్నారు.

52 ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం



పలాసరూరల్,ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): పలాస ఎల్‌సీ గేటు వద్ద ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయాలయంలో చైత్రమాస దుర్గానవమి పూజల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామోత్సవాల సందర్భంగా 52 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. హోమం, పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో అర్చకులు బుద్ధి రామ్, రాజేష్, గణేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రానైట్ క్వారీలకు పర్మిట్లు మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టెక్కలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నీలి రంగు గ్రానైట్ పరిశ్రమల్లోని బ్లాకులు తరలించేందుకు పది రోజుల పాటు మాన్యువల్ విధానంలో పర్మిట్లు మంజూరు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏడీ విజయ కుమారి తెలిపారు. ఈనెల 3న 'ఆంధ్రజ్యోతి'లో 'నిలిచిన గ్రానైట్ పర్మిట్లు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆ శాఖ ఉన్నతాధి కారులు స్పందించారు. వాస్తవానికి మార్చి 17తో విశ్వసముద్ర సంస్థ టెండర్లు పూర్తికావడంతో 18 రోజుల పాటు పర్మిట్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి కొంతమేర గండిపడింది.


లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

నరసన్నపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలని లయన్స్ గవర్నర్ సుబ్బరాజు అన్నారు. ఆదివారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. పేదరిక నిర్మూలన నిమిత్తం అవగాహన కల్పించాలన్నారు. గత 25 ఏళ్లుగా నరసన్నపేటలో లయన్స్ క్లబ్ అందించిన సేవలను కొని యాడారు. అనంతరం పూర్వ అధ్యక్షులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతి నిధులు రమేష్‌రాజు, వర్మ, ఆర్‌సీవీపీ రంగనాథ్, రమణసాహు, కార్యదర్శి సాయిరాం, కోరాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

కొత్తూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు, నివగాం ప్రధాన మార్గాల్లో రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.65 లక్షలు మంజూరు చేయించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు టీడీపీ నేతలు ఎల్.తులసీ వరప్రసాదరావు, బిర్లింగి సంజీవరావు, రేగేటి కన్నయ్య తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రెండు మార్గాల్లో రోడ్లు గోతులమయమై దారుణంగా ఉండడంతో సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కొయిలాపు సంజీవరావు, పడాల వెంకటకృష్ణ, గేదల మన్మథరావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

ఇక స్మార్ట్ కార్డులు



(ఐదో పేజీ తరువాయి)

అధికారులు సూచిస్తున్నారు. సదరం ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకునే వారు దివ్యాంగ సర్టిఫికెట్‌తోపాటు యూడీఐడీ పొందేలా చర్యలు చేపడుతున్నా మన్నారు.

● హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌డబ్ల్యూఏవిఎల్‌ఏఎంబీఏ ఎన్‌సీఏ ఆర్‌డీ. జీవోవీ.ఐఎన్ పోర్టల్‌ను తెరిచి యూడీఐడీ కార్డు కోసం సమగ్ర వివరాలు పొందుపర్చాలి.

● మీ సేవ, సీఎస్సీ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని సదరం శిబిరానికి హాజరుకావాలి. అక్కడి వైద్యులు పరీక్షించి వైకల్యాన్ని నిర్ధారిస్తారు. అనంతరం స్మార్ట్ కార్డు మంజూరు చేస్తారు. డిజిటల్ సంతకాలతో కూడిన ఈ కార్డుల్లో ఐడీ నెంబరు, దివ్యాంగుడి పేరు, వైకల్యం రకం, శాతం తదితర వివరాలు ఉంటాయి. వీటిని తపాలా శాఖ ద్వారా దివ్యాంగుడి చిరునామాకు నేరుగా పంపుతారు.

ఇవీ ప్రయోజనాలు..

దివ్యాంగులు స్మార్ట్ కార్డులతో రైలు, బస్సు టికెట్లుపై రాయితీ పొందవచ్చు. పింఛన్లు, సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలు అందుకునే వెసులుబాటు ఉంది. దేశంలో ఎక్కడనుంచైనా ఈ కార్డులు ఉపయోగించుకొనే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఈ అవకాశం తమపాలిట వరంగా మారనుంది దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ

రేషన్ కార్డుల స్థానంలో లబ్ధిదారులకు ఏటీఎం కార్డు సైజు మాదిరి స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రేషన్ సరుకులు పక్కదారి పడుతున్న నేపథ్యంలో బార్ కోడ్‌తో ఈ కార్డులను సిద్ధం చేస్తోంది. మే నెల నుంచి వీటిని పంపిణీ చేయనున్నట్టు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 6,71,803 రేషన్‌కార్డులు ఉండగా 19,39,082 మంది సభ్యులు ఉన్నారు. అందులో ఇప్పటి వరకు 18 లక్షల మంది ఈకేవైసీ చేయించుకోగా మరో లక్షమంది చేయించుకోవాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని రేషన్ డీలర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేసేలా అవకాశం కల్పించింది. ఈ పక్రియ ముగిసిన వెంటనే ప్రభుత్వం కార్డుల్లో చేర్పులు, మార్పులతోపాటు తొలగింపులకు ఆప్షన్లు ఇవ్వనుంది. ఆ తర్వాత కార్డుదారులకు స్మార్ట్ కార్డులను అందజేయనుంది. ఈ కార్డుల్లో కుటుంబ సభ్యుల అందరి ఫొటోలు ఉంటాయి. పూర్తి చిరునామా ఉంటుంది. ప్రస్తుతం అన్నింటికీ రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో.. వీటిని జేబులో పెట్టుకునేందుకు ఈజీగా ఉంటుంది.